నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
8 నిజామాబాద్, సోమవారం 19 మే 2025 NIZAMABAD



నిజాంసాగర్ ప్రాజెక్టు

## ప్రధాన ప్రాజెక్టులూ వెలవెల

ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన ప్రాజెక్టులైన శ్రీరాంసాగర్, నిజాంసాగర్ లోనూ నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులు కాగా ప్రస్తుతం 1060 అడుగులకు చేరింది. నీటి సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 11.23 టీఎంసీలు ఉన్నది. వారం రోజులుగా 1736 క్యూసెక్కులతో వరద వస్తుండడంతో కాసింత నీటి నిల్వలో పెరుగుదల నమోదైంది. మొన్నటి వరకు ఎస్సారెస్పీలో ప్రమాదకరంగా నీటి నిల్వ దాదాపుగా ఆరు టీఎంసీల వరకు చేరింది. గతేడాది జూన్ 1నుంచి మే 18 వరకు 291.088 టీఎంసీలు ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. 287.253 టీఎంసీలు అవుట్ ఫ్లో కొనసాగింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న జలాలను మిషన్ భగీరథకు వినియోగించుకోగా మిగిలిన నీళ్లను అత్యంత జాగరూకతతో సాగుకు వాడుకునే అవకాశాలున్నాయి. వానాకాలంలో వర్షాల రాక ఆలస్యమైతే ఎస్సారెస్పీ నుంచి నీళ్లను విడుదల చేయడం కూడా గగనంగా మారవచ్చని అధికారులు భావిస్తున్నారు. మంజీరా నదిపై ఉన్న చారిత్రక నిజాంసాగర్ ప్రాజెక్టులోనూ నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. నీటి సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.508 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. 1405 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టానికి 1392 అడుగులకు నీటి నిల్వ చేరింది. మరో రెండు వారాల్లో ఈ నీటి నిల్వ స్థాయి మరింత తగ్గే ప్రమాదం ఉంది. నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో దాదాపుగా రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా..భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

### వానలు ఆలస్యమైతే గడ్డు పరిస్థితులే..



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

వానాకాలం సీజన్‌లో వర్షాలు ఆలస్యమైతే గడ్డు పరిస్థితులు ఎదురుకానున్నాయి. వరి నాట్లు ఆలస్యమయ్యే సూచనలే ఎక్కువగా కనిపిస్తోంది. వానలు లేకపోతే రైతులు ఆగమాగమయ్యే పరిస్థితి నెలకొన్నది. వానలు కురువకపోతాయా ? అనే ధైర్యంతో పంటల సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. కుంటలు, తటాకాలు, వాగులు, వంకలు, ప్రాజెక్టులు ఇలా ఎక్కడ చూసినా నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. జూన్ నెలలోపే ఈశాన్య రుతుపవనాలు వస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసినప్పటికీ పరిస్థితులు ఎలా ఉంటాయన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. పలు ప్రాంతాల్లో రైతులంతా వరుణ దేవుడిపైనే భారం పెట్టుకుని కాలం వెళ్లదీసే పరిస్థితులున్నాయి. పుటం మడులు వేసుకుని నాట్లకు సిద్ధమవుదామనుకునే వారికి భూగర్భ జలాలు కూడా అందుబాటులో లేకుండాపోయాయి. మరో వైపు కాలువల ద్వారా నీళ్లు అందే పరిస్థితి కూడా కనిపించడం లేదు. యాసంగి 2024-25 సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం కింద ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ ఇవ్వలేదు. ఉమ్మడి జిల్లాలో సగానికి ఎక్కువ మందికి సాయం అందలేదు. వానాకాలం ముంచుకొస్తున్న ఈ సమయంలో సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వానాకాలంలోనైనా రైతుభరోసా వస్తుందా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- వర్షాలపైనే రైతుల ఆశలు..'భరోసా' కోసం ఎదురుచూపులు
- ఉమ్మడి జిల్లాలో అడుగంటుతున్న జలవనరులు
- బోసిపోతున్న వాగులు, వంకలు, తటాకాలు
- ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టులు సైతం వెలవెల
- పంటల సాగుపై రైతుల్లో ధీమా నింపని కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్‌ఎస్ హయాంలో ఎండాకాలంలోనూ జలసిరులు
- నిజామాబాద్ జిల్లాలో 993, కామారెడ్డిలో 1514 చెరువులు

# ముంచుకొస్తున్న సీజన్ !

## వానకాలం సాగుకు సన్నద్ధం

నిజామాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): యాసంగి సీజన్ ముగియడంతో రైతులు వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ధాన్యం విక్రయాలు పూర్తయిన వారు పొలాలను చదునుచేసుకుంటున్నారు. వరుణదేవుడు కరుణిస్తే జూన్ నెలలోనే వరి నాట్లు వేసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఒకవేళ వానలు ఆలస్యమైతే గడ్డుపరిస్థితులను ఎదుర్కొనే రైతును ఆదుకునే వారు లేకుండాపోయారు. నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మినహాయిస్తే అనేక చోట్ల చెరువుల్లో నీళ్లు లేవు. ఇరిగేషన్ శాఖ ప్రాథమిక సమాచారం మేరకు నిజామాబాద్ జిల్లాలో 993 చెరువులున్నాయి. ఇందులో దాదాపుగా సగం చెరువుల్లో 25శాతం అంచున నీళ్లున్నాయి. మిగితా వాటిల్లో నీటి జాడ కరువైంది. కామారెడ్డి జిల్లాలో 1514 చెరువులుంటే ఇక్కడ కూడా అదే దుస్థితి నెలకొన్నది. 20శాతం చెరువుల్లోనే 25శాతానికి పైగా నీళ్లు ఉండగా మిగిలిన వాటి పరిస్థితి దయనీయంగా ఉన్నది. పదేండ్ల కేసీఆర్ పాలనలో చెరువుల్లో ఏడాదిపొడవునా జలకళ కనిపించేది. కాలంతో సంబంధం లేకుండా రైతులకు సాగు బలం ఉండేది. నిత్యం జలకళతో కాలువలు, తటాకాలు నిండుకుండను తలపించేవి. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో గడ్డు పరిస్థితులు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండడానికి ఇప్పటివరకూ ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

ఎండిపోతున్న మోపాల్ మండలంలోని కులాస్‌పూర్ చెరువు



## బాధిత కుటుంబానికి వేముల అండ



మీర్‌పేట్ ఎస్సైతో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, మే 18: బాల్కొండ నియోజకవర్గంలో ఎవరికి ఎలాంటి కష్టమొచ్చినా నేనున్నానంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అండగా ఉంటున్నారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ పరిష్కరిస్తున్నారు. తాజాగా వేల్పూర్‌లో ఓ బాధిత కుటుంబానికి అండగా ఉండి, వారిలో ధైర్యం నింపారు. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన మేదరి రాజేశ్వర్ కూతురు కావేరికి మెట్‌పల్లి మండలం కోన్‌రికల్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌తో ఏడు నెలల క్రితం వివాహం జరిగింది. వ్యాపార నిమిత్తం కావేరి దంపతులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అయితే వివాహం జరిగినప్పటి నుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో కావేరి శనివారం రాత్రి పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ కావేరి మృతి చెందింది. విషయం తెలుసుకున్న కావేరి తల్లిదండ్రులు ఆదివారం ఉదయం దవాఖానకు వెళ్లగా, అప్పటి వరకు అక్కడే ఉన్న లక్ష్మణ్ కుటుంబ సభ్యులు కావేరి మృతదేహాన్ని దవాఖానలోనే వదిలి వెళ్లిపోయారు. దీంతో కావేరి తల్లిదండ్రులు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులకు ఈ విషయం చెప్పడంతో వారు వేల్పూర్‌లో వివిధ కార్యక్రమాలకు హాజరైన మాజీ మంత్రి వేముల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వేముల వెంటనే మీర్‌పేట్ ఎస్సై శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. కావేరి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

## అందాల పోటీలు తప్ప ప్రజల ప్రాణాలు పట్టవా?

- సీఎం రేవంత్ రెడ్డికి ప్రమాదస్థలికి వెళ్లే తీరిక లేదా ?
- గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంలో 17 మంది మరణించడం బాధాకరం
- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



ఆర్మూర్‌టౌన్/ఖలీల్‌వాడి, మే18: గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద ఘటనపై బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రమాదంలో 17 మంది మృతిచెందడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి అగ్ని ప్రమాద ఘటనా జరిగిన స్థలానికి వెళ్లే తీరిక లేదా? అని ప్రశ్నించారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను ఓదార్చి, ధైర్యం చెప్పే బాధ్యతను మరిచారని విమర్శించారు. ముఖ్యమంత్రికి అందాల పోటీలు, విహారయాత్రలు, ఫొటోషూట్‌లు తప్ప ప్రజల ప్రాణాలు పట్టవా? అని మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ అలసత్వానికి ఏ పాపం ఎరుగని సామాన్యులు సమిధులవుతున్నారని పేర్కొన్నారు. ఎంతో మంది క్షతగాత్రులై విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి అగ్నిమాపక శాఖ సంసిద్ధతపై సమీక్ష నిర్వహించాలని సర్కార్‌కు సూచించారు.





సామాజిక శిక్షలో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్లకార్డులు పట్టుకుని నిలబడిన యువకుడు

- నగరంలో అతివేగంగా బైక్ డ్రైవింగ్
- గమనించిన సీపీ సాయి చైతన్య
- ప్లకార్డులు పట్టుకొని అవగాహన కల్పించాలని ఆదేశం

## ట్రాఫిక్ రూల్స్ పాటించని యువకులకు సామాజిక శిక్ష

వినాయక్‌నగర్, మే 18: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి పోలీసులు సామాజిక శిక్ష విధించారు. వారితోనే ప్లకార్డుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలో శనివారం మధ్యాహ్న సమయంలో సీపీ సాయిచైతన్య తన వాహనంలో వెళ్తుండగా ఓ బైక్‌పై ఇద్దరు యువకులు మితిమీరిన వేగంతో వంకర్లు తిప్పుకుంటూ వెళ్లడాన్ని గమనించారు. వెంటనే సదరు యువకులను పట్టుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో సిబ్బంది బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను పట్టుకున్నారు. వారిపై ఎలాంటి కేసు నమోదు చేయవద్దని, జరిమానా కూడా విధించవద్దని సీపీ సూచించారు. వారికి సామాజిక శిక్ష విధించారు. 'మీ సేఫ్టీ కోసం హెల్మెట్ ధరించాలి' అని రాసి ఉన్న ప్లకార్డులు పట్టుకొని మూడు గంటల పాటు రోడ్డు పై డ్యూటీ చేయాలని ఆదేశించారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ధర్నా చౌక్, జిల్లా కోర్టు చౌరస్తా వద్ద ఇద్దరు యువకులు ప్లకార్డులు పట్టుకొని నిలబడ్డారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, ఇతరులకు ఇబ్బందులు కలిగేలా వాహనాలు నడిపితేచర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ ప్రసాద్ హెచ్చరించారు.

## యువత సృజనాత్మకతకు పట్టాభిషేకం

- జూన్ 2న 'తెలంగాణ యువ కెరటాలు' సమ్మేళనం
- జాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతి కుమార్

ఖలీల్‌వాడి, మే 18 : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న 'తెలంగాణ యువ కెరటాలు' శీర్షికన యువ కవుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు జాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతికుమార్ తెలిపారు. ఈ సమ్మేళనం తెలంగాణ యువత సృజనాత్మకతకు వేదిక అని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ కవిత కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించనున్న సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అవంతికుమార్ మాట్లాడుతూ.. సాహిత్య రంగంలో యువతను ప్రోత్సహించడానికి తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత చేస్తున్న కృషి ముందు తరాలకు వెలుగు బాటలు వేస్తుందన్నారు. తెలంగాణ జీవనశైలి విశిష్టతను చాటి చెప్పే కవిసమ్మేళనంలో తెలంగాణ ఆత్మను ఆవిష్కరిస్తూ తెలంగాణ తాత్వికతను, చారిత్రక నేపథ్యాన్ని తెలంగాణ సమాజంలో కనిపించే సమష్టితత్వాన్ని ప్రతిబింబించేలా యువ కవులు, కవయిత్రులు తమ కలాలకు పదును పెట్టాలని సూచించారు. జిల్లా నుంచి యువసాహితీవేత్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కవులు, కవయిత్రులు 35 ఏండ్లలోపు ఉండాలని, తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో తమ కవితలు వినిపించవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న కవులు తమ వివరాలతో ఈనెల 26 లోపు kavitha. telangana@gmail.com కు మెయిల్ చేయాలని సూచించారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ చరిత్రను, పోరాట స్ఫూర్తిని తమ కవితల ద్వారా చాటి చెప్పాలని కోరారు. సమావేశంలో ప్రముఖ కవి ఘనపురం దేవేందర్, తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం కన్వీనర్ తిరుమల శ్రీనివాస్ ఆర్య, శ్యామల సాయికృష్ణ, హరీశ్ యాదవ్, ఆకాశ్, తేలు సరిత, శోభావతి, సరిత, నితిన్, బుచ్చమ్మ, రోహిత్ పాల్గొన్నారు.



సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు, ప్రతినిధులు

## కానిస్టేబుల్ వడ్డీ వ్యాపారం !

### అమాయకుల నుంచి అధిక వడ్డీ వసూలు

- చెల్లించని వారికి వేధింపులు
- బాకీ కింద తన పేరిట ఆస్తుల రిజిస్ట్రేషన్
- బాధితుల ఫిర్యాదు మేరకు సదరు పోలీసుపై కేసు నమోదు
- అప్రతిష్ట మూటగట్టుకుంటున్న పోలీసు శాఖ
- వేటు వేస్తున్నా ఖాకీల్లో మారని తీరు



వినాయక్‌నగర్, మే 18: సమాజానికి, ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు కొంతకాలంగా అవినీతి, అక్రమాలకు పాల్పడున్నారు. కొందరు పోలీసులు వక్రమార్గంలో వెళ్తూ పోలీసుశాఖను అప్రతిష్టపాలు చేస్తున్నారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో అవినీతి, అక్రమాలు, సివిల్ తగాదాలు, ఇసుక అక్రమ రవాణా తదితర కేసుల్లో కొందరు పోలీసులు సస్పెన్షన్ వేటుకు గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇంతజరిగినా కొందరిలో ఇంకా మార్పు రావడంలేదు. తాజాగా ఓ కానిస్టేబుల్ ఏకంగా వడ్డీ వ్యాపారిగా అవతారమెత్తి అమాయకుల బలహీనతను ఆసరాగా తీసుకొని అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడు. ఎలాంటి అనుమతులూ లేకుండా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ చెల్లించని వారి ఆస్తులను తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నాడు.

సదరు కానిస్టేబుల్ వేధింపులు తాళలేక బాధితులు నిజామాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వడ్డీ వ్యాపారి అవతారమెత్తిన కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేశారు. నిజామాబాద్ రూరల్ ఎస్సై మమ్మద్ ఆరీఫ్‌తోపాటు విశ్వసనీయ వర్గాలు అందించిన సమాచారం మేరకు వివరాలు.. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత కూతురు అనారోగ్యంతో దవాఖానలో చేరింది. చికిత్స కోసం డబ్బులు అవసరం ఏర్పడింది. ఈ విషయం ఓ వ్యక్తి ద్వారా మెండోరా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ కానిస్టేబుల్ కలివరి గంగాధర్‌కు తెలిసింది. దీంతో కానిస్టేబుల్ గంగాధర్ సదరు మహిళ వద్దకు వెళ్లి మీ వద్ద ఏదైనా ప్రాపర్టీ ఉంటే తన పేరిట సేల్ డీడ్ చేస్తే డబ్బులు ఇస్తానని నమ్మించాడు. దీనికి అంగీకరించిన మహిళ తనకు చెందిన రూ.20 లక్షలు విలువ చేసే ఓపెన్ ప్లాట్‌ను కానిస్టేబుల్ పేరిట సేల్‌డీడీ చేసి ఇచ్చింది. ఈ మేరకు సదరు మహిళకు కానిస్టేబుల్ రూ.8లక్షలు ఇచ్చి, 5 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాల్సి ఉంటుందని కండీషన్ పెట్టాడు. సదరు మహిళ తీసుకున్న డబ్బులకు సకాలంలో వడ్డీ చెల్లించడం లేదని కానిస్టేబుల్ రికవరీ కోసం పెట్టుకున్న వ్యక్తులను ఆమె ఇంటికి పంపించి వేధించసాగాడు. వేధింపులు ఎక్కువకావడంతో సదరు మహిళ శనివారం నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ కె.గంగాధర్ పై ఫిర్యాదు చేసింది. దీంతో గంగాధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యండీ ఆరీఫ్ తెలిపారు. అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి మరొకరిని వేధిస్తున్నట్లు తెలుసుకొని సుమోటో కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.